అప్రమత్తంగా ఉండాలి

- రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 3: రాబోయే 24 గంటల్లో వాతావరణ శాఖ ప్రకటించిన దాని ప్రకారం జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ డాక్టర్ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నందున అటు వైపు ప్రజలు, ప్రయాణికులు వెళ్లకుండా బారికేడ్స్ ఏర్పాటు చేసి అనునిత్యం నిఘా ఉంచాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ 871266 7100 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

సీతారామచంద్ర స్వామికి మకరతోరణం బహూకరణ

సీతారామచంద్రస్వామికి భక్తులు సమర్పిస్తున్న మకరతోరణం

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 3 : కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో శ్రీరామాంజనేయ స్వామి ఆలయంలోని సీతరామచంద్రస్వామికి మంగళవారం జగద్గిర్‌గుట్టకు చెందిన కన్నోజు శ్రీనివాస చార్యులు భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు వేదాన్ చార్యులు రూ. 26 వేల విలువ గల మకరతోరణాన్ని బహూకరించారు. ఆలయ అర్చకుడు బూర్గోజు బాల బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కొండపాక కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కొండపాక (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 3 : పరిసరాల శుభ్రత వల్ల సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం కొండపాక మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డైనింగ్‌హాల్, వంటశాలతో పాటు పాఠశాల ఆవరణను, ఆహార పదార్థాలను అధికారులతో కలిసి పరిశీలించారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థులను తల్లిదండ్రులు సెలవుల్లో ఇంటికి తీసుకువేళితే సెలవులు ముగిసిన వెంటనే పాఠశాలకు పంపాలని సూచించారు. తద్వారా విద్యార్థులు చదువులో ముందుంటారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంపీడీ వో వెంకటేశ్వర్లు, ఎంఈవో పి.శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి.. శవమై

జాలరి లక్ష్మణ్ మృతదేహం గుర్తింపు

బయటకు తీసిన జాలరి లక్ష్మణ్ మృతదేహం

బెజ్జంకి, సెప్టెంబర్ 3 : జీవనోపాధి కోసం చేపలు వేటకు వెళ్లిన జాలరి.. శవమైన తీరు అందరినీ కలిచి వేసింది. ఆదివారం సాయంత్రం తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ వద్ద గల్లంతైన లక్ష్మణ్ కోసం గాలింపు చేపట్టగా, మంగళవారం మధ్యాహ్నం ఆతడి శవాన్ని గుర్తించారు. కుమారుడు శ్రవణ్ ఫిర్యా దు మేర కు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభు త్వ దవాఖానకు తరలించారు. గాలింపు చర్యలో పాల్గొన్న సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బందికి మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు, సొసైటీ అధ్యక్షుడు రాములు, గ్రామస్తులు, మృతుడి కు టుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులు, కుంటలను పరిశీలించిన ఆర్డీవో

నాలను పరిశీస్తున్న ఆర్డీవో బన్సీలాల్

గజ్వేల్, సెప్టెంబర్ 3: గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంట నీటి కాల్వలను మంగళవారం ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ శ్రవణ్, సీఐ సైదా, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ నర్సయ్య పరిశీలించారు. ఎర్రకుంట నీటితో నిండడంతో నీళ్లు తూప్రాన్ మార్గంలో రోడ్లపై నిలుస్తున్నాయి. నీళ్లు వెళ్లే నాలాలను పరిశీలించారు. అనంతరం ప్రజ్ఞాపూర్ ఊర చెరువును పరిశీలించారు.

కర్కలమ్మవాగు పరిశీలన

కర్కలమ్మవద్దగల వాగు ఉధృతిని పరిశీలిస్తున్న సీఐ లతీఫ్

వర్గల్, సెప్టెంబర్ 3 : వర్గల్ మండలంలోని చందాపూర్, బొంరెగూడెం గ్రామాల మధ్య గల కర్కలమ్మ వద్ద గల మత్తడి దెబ్బతిని రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో మంగళవారం బేగంపేట పోలీస్ బృందం ఆధ్వర్యంలో తొగుట సీఐ లతీఫ్ సిబ్బంది వాగు ఉధృతిని పరిశీలించారు. వరద తాకిడికి కొట్టుకు పోయిన ప్రధాన రోడ్డుతోపాటు మత్తడి కాంక్రిట్‌ను పరిశీలించి చేపట్టవలసిన పనులను ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వరద ఉధృతి తగ్గే వరకు ఇరువైపులా రాకపోకలను బ్లాక్‌చేశారు. ఏఎస్సై అమృత్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సాగర్‌కు కొనసాగుతున్న గోదావరి పరవళ్లు

మల్లన్న సాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలు

తొగుట, సెప్టెంబర్ 3 : గోదావరి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఒడిసి పట్టే ప్రయత్నం చేస్తున్నారు. 8 రోజులుగా కొనసాగుతూనే ఉన్నది. మంగళవారం నుంచి 6 పంప్‌ల ద్వారా మల్లన్న సాగర్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ ప్రాజెక్టుకు అవసరమైన నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు మల్లన్న సాగర్‌లో 12.5 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, కొండపోచమ్మ ప్రాజెక్టులో 8.4 టీఎంసీల నీరు నిల్వ ఉందని డీఈ శ్రీనివాస్ తెలిపారు. మల్లన్న సాగర్‌లోకి నీటి నిల్వ చేస్తుండటంతో రైతుల్లో సంతోషం నెలకొన్నది.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్ మనుచౌదరి

దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ మనుచౌదరి

దుబ్బాక, సెప్టెంబర్ 3 : నిత్యం ప్రజాపాలనలో బిజీగా ఉండే సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి ఒక్కసారిగా ఓ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధిస్తూ ఉపాధ్యాయుడిగా మారారు. మంగళవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతిలోకి వెళ్లి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్‌లోని వేగం, దూరం, కాలం తదితర అంశాలపై ఆయన బోధించారు. పాఠశాలలో విద్యార్థులకు బోధన పరమైన, వసతుల పరంగా నెలకొన్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం దుబ్బాకలో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. దుబ్బాక తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంఈవో ప్రభుదాస్, ఎంపీడీవో భాస్కరాశర్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ప్రతి రంగంలో రాణించాలి

రాయపోల్, సెప్టెంబర్ 3 : ప్రభుత్వ గురుకులాల్లో అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తుందని కలెక్టర్ మను చౌదరి అన్నారు. రాయపోల్ మండలంలోని ఎంజేపీ, దౌల్తాబాద్ మండలంలోని లింగరాజు పల్లి మహాత్మాజ్యోతిరావు పులే గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యతో పాటు విద్యార్థులు ప్రతి రంగంలో రాణించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ స్వప్న, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజించాలి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 3 : వినాయతి చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి పూజించాలని తద్వారా చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, ఆర్‌సీపురం వారు రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవీందర్, పర్యావరణ శాస్త్రవేత్త, కాలుష్య మండలి ఆర్‌సీపురం తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రులపై దాడి హేయమైన చర్య

సిద్దిపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

చేర్యాల, సెప్టెంబర్ 3 : ఖమ్మం వరద బాధితులకు సహాయ చర్యలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందంపై కాంగ్రెస్ గుండాలు దాడికి దిగడం హేయమని మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బాధితులకు అండగా ఉండేందుకు వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందంపై కాంగ్రెస్ గుండాలు దాడికి దిగడం అత్యంత హేయమని, దాడికి దిగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు, సెప్టెంబర్ 3 : మాజీ మంత్రులపై కాంగ్రెస్ గుండాల దాడి హేయమైన చర్య అని చిన్నకోడూరు మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. చిన్నకోడూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 3 : ఖమ్మంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ నాయకులు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్వీ చిన్నకోడూరు మండలాధ్యక్షుడు గుజ్జ రాజు మాట్లాడారు. నాయకులు లింగం, రాజశేఖర్, నాగరాజు, చందు పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఉంటే..

సిద్దిపేట, సెప్టెంబర్ 3 : వరదల సమయంలో ప్రతిపక్షం.. పాలక పక్షం అని చూడకుండా కలిసి పని చేయాలి కానీ, ప్రతిపక్షం సహాయం చేస్తుంటే అధికార పార్టీ అడ్డుకోవడం, దాడులు చేయడం ఏమిటని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులతో కలిసి వారు మాట్లాడారు. నాయకులు అరవింద్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, మోయిజ్, సాయి ప్రేమ్, భాస్కర్, రవి పాల్గొన్నారు.

కొండపాకలో..

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 3 : ఖమ్మం జిల్లాలోని వరద బాధితులను పరామర్శించడానికి బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులు వెళితే వారిపై కాంగ్రెస్ గుండాలు రాళ్లతో దాడి చేయ డం సిగ్గు మాలిన చర్య అని బీఆర్ఎస్ కొం డపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ అన్నారు. ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 3 : కొండపాక మండలంలోని సిరిసనగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చదువున్నప్పటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. ఉపాధ్యాయులు బలరామ్, యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, పద్మ, పూర్వ విద్యార్థులు ఎర్రోళ్ల రమేశ్, అనిల్, ప్రభాకర్, కిరణ్, శ్రీధ ర్, సత్యనారాయణ, బాల్‌రాజ్, అలీం పాషా, రామకృష్ణారాజు,కనకయ్య, దివ్య, రాణి, స్వ ప్న, కృష్ణలీల పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత మనందరి బాధ్యత

సిద్దిపేట, సెప్టెంబర్ 3 : రోడ్ల పక్కన వేసిన చెత్తను వెంటనే తొలిగించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ శానిటరీ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో పలు వార్డులో ఆయన పర్యటించారు. కుశాల్ నగర్‌వైకుంఠధామం అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను మర్యదపూర్వకంగా కలిశారు.

పిన్నింటికి గద్దర్ అవార్డు

గద్దర్ అవార్డు అందుకుంటున్న ఐనాపూర్‌కు చెందిన కళాకారుడు పిన్నింటి రత్నం

కొమురవెల్లి, సెప్టెంబర్ 3 : కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్‌కు చెందిన పిన్నింటి రత్నం గద్దర్ అవార్డును దక్కించుకున్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గిద్దె గళం సంస్థ గిద్దె రాంనర్సయ్య నిర్వహించిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఐనాపూర్‌కు చెందిన పిన్నింటి రత్నం గిద్దె గల సంస్థ నిర్వాహకుడు గట్టగల్ల సంజీవ, జనగామ జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా గద్దర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి చేర్యాల ప్రాంతం నుంచి ఈ అవార్డుకు తనను ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా ?

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షం నీరు నిల్వడం కారణంగా అక్కడక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. సిద్దిపేట రాంనగర్ నుంచి ఎల్లమ్మ ఆలయం మీదుగా వెళ్లే రహదారి మరీ అధ్వాన్నంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్డుపై మోరం పోసి చదును చేసి అయినా ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

-సిద్దిపేట కమాన్, సెప్టెంబర్ 3

మూతపడిన హాస్టళ్లను వెంటనే తెరిపించాలి

చేర్యాలలో మూతపడిన హాస్టల్‌ను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

చేర్యాల, సెప్టెంబర్ 3 : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కారు పేద విద్యార్థులు నివాసం ఉంటూ చదువుకుంటున్న హాస్టల్స్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలో మూతపడిన హాస్టల్స్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మూ తపడిన హాస్టళ్లను ప్రభుత్వం వెంటనే తెరిపించాలని, వసతిగృహాలు మూతపడడానికి కారణమైన వార్డెన్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్ కార్యదర్శి తాడూ రి భరత్, అరవింద్, మధు ఉన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

మోతెలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏవో సత్యాన్వేష్

మిరుదొడ్డి (అక్బర్‌పే-భూంపల్లి), సెప్టెంబర్ 3 : రుణమాఫీ కాని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల ఏవో సత్యాన్వేష్ అన్నారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె గ్రామంలో రుణమాఫీ కాని రైతు కుటుంబాలను సందర్శించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 2 లక్షలకు పైగా ఉన్న పంట రుణాలను అర్హులైన రైతులకు త్వరలోనే మాఫీ చేయడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సాంకేతిక కారణల వల్ల రైతులకు రుణమాఫీ రాకుంటే వెంటనే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, ఏఈవోలు సాయి కుమార్, సమ్రీన్ బేగం, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

చేర్యాలలో కోర్టు ప్రారంభించాలని పాదయాత్ర

చేర్యాలలో కోర్టు ప్రారంభం కోసం పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, సెప్టెంబర్ 3 : పట్టణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కోర్టు మంజూ రు చేసిందని దానిని ప్రారంభించేందుకు నేటి పాలకులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని వెంటనే కోర్టు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యం లో చేర్యాలలో రెండు కిలోమీటర్ల మేరకు పాద యాత్ర నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడు తూ చేర్యాల,కొమురవెల్లి,మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన 53 గ్రామాల ప్రజలు కోర్టు కేసులు నిమిత్తం హుస్నాబాద్, సిద్దిపేటకు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నాయకులు రాళ్లబండి శశిధర్,శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, రాళ్ల బండి నాగరాజు, ఆలేటి యాదగిరి, చొ ప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, పోలోజు శ్రీహరి, ఆముదాల నర్సిరెడ్డి, మోకు దేవేందర్‌రెడ్డి, బోయని మల్లేం, అజ్గర్ పాల్గొన్నారు.

రాకపోకలు నిలిచిపోవడంతో ధర్నా

కడవేర్గు కల్వర్టు వద్ద ధర్నా నిర్వహిస్తున్న కడవేర్గు గ్రామస్తులు

చేర్యాల, సెప్టెంబర్ 3 : మండలంలోని కడవేర్గు గ్రామ సమీపంలోని లోలెవల్ కల్వర్టు ఉధృతంగా ప్రవహిస్తుంది. కడవేర్గు ప్రజలతో పాటు పోతిరెడ్డిపల్లి, నాగపురి, పెదరాజుపేట గ్రామాల ప్రజల చేర్యాల మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోవడంతో మంగళవారం కడవేర్గు గ్రామస్తులు కల్వర్టు వద్ద ధర్నా నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని అప్పటి వరకు తాత్కాలికంగా రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చేర్యాల, సెప్టెంబర్ 3 : అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు సంయుక్తంగా పట్టుకొని కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల పట్టణ శివారులో యాదాద్రి-భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోత్ జితేందర్ ఆటోలో అనుమతులు లేకుండా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం మేరకు 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు చేర్యాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యాన్ని బాక్ల్‌లో అమ్మితే చర్యలు

గజ్వేల్, సెప్టెంబర్ 3 : రేషన్ బియ్యాన్ని బాక్ల్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, రేషన్ డీలర్లు ప్రతి నెలా సక్రమంగా బియ్యాన్ని పంపిణీ చేయాలని సివిల్‌సై అడిషనల్ ఎస్పీ ప్రోణాచార్యులు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం దుకాణాదారులు నడుచుకోవాలని, లబ్ధిదారులు బియ్యాన్ని బ్లాక్‌లో అమ్మినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, సాంబశివరావు, బి. జయ భూషణం, ఆర్ఐ కృష్ణ ఉన్నారు.

పాఠశాలకు కొత్త భవనాన్ని నిర్మించాలి

తొగుట, సెప్టెంబర్ 3 : మండలంలోని కాన్గల్ జిల్లా పరిషత్ పాఠశాలోని పాఠశాల భవనంపై కప్పు పెచ్చులు ఊడటంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైకప్పు పెచ్చులు కూలాయి. ఆసమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి పాఠశాల భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ మంత్రి ఆర్థిక సాయం

చిన్నకోడూరు, సెప్టెంబర్ 3 : చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందని దరిపల్లి దుర్గయ్య ఇటీవల డెంగీతో మృతిచెందాడు. స్థానిక నేతలతో విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు రూ.5 వేలు తక్షణ సాయంగా పంపించారు. మంగళవారం బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దరిపల్లి సాయిలు, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, రామాగౌడ్, వెంకట్‌రెడ్డి, కనకయ్య, దేవయ్య, మహేందర్ కలిసి అందజేశారు.

చేర్యాలలో..

చేర్యాల, సెప్టెంబర్ 3 : మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన గుండ్ర మంకాళమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పెడుతల అమరేందర్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి రూ. 5వేలు ప్రకటించడంతో గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఎల్లారెడ్డి గ్రామ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులు అందజేశారు.

కొండపాకలో..

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 3 : కొండపాక గ్రామానికి చెందిన జంగం పల్లి కనకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పరామర్శించి, రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఖమ్మంపల్లి చేపల బండ ఇటుక బట్టిలో పనిచేసే ఇతర రాష్ట్రాల వలస కార్మికులకు మంగళవారం సేవ్ ఎర్త్ సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ యాదగిరి నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట మంతురి జగదీశ్వర్, నూనె నాగేశ్, రాములు ఉన్నారు.

నేడు మట్టి వినాయకుల పంపిణీ

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 3 : పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా ప్రతి ఏటా ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నామని అమర్నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు కొర్తివాడ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం సేవా సమితి గౌరవ అధ్యక్షుడు ఉప్పల భూపతితో కలిసి ఆయన మాట్లాడుతూ బుధవారం సిద్దిపేట వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద 10 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు.

అడవి పందుల దాడి.. పంటకు తీవ్ర నష్టం

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 3 : కొండపాక మండలంలోని బందారంలో రైతు నీల కిష్టయ్యకు చెందిన 3 ఎకరాల మొక్కజొన్న పంటపై మంగళవారం అడవి పందులు దాడి చేసి తీవ్ర నష్టం చేశాయి. ఈ సందర్భంగా రైతు కిష్టయ్య మాట్లాడుతూ ఎంతో శ్రమించి పంట చేతికొచ్చే సమయంలో మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేయడంపై కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మాజీ ఎంపీపీకి నివాళి

కొండపాక మాజీ ఎంపీపీ శారదమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 3 : కొండపాక మాజీ ఎంపీపీ అనంతుల శారదమ్మ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు.బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి శారదమ్మ భౌతికఖాయం వద్ద నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మార్క సతీవ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి కుంచెం రవి, శ్రావణ్ ఉన్నారు.

హాస్టళ్లను సందర్శించిన అధికారులు

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 3 : మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూళ్లకు చెందిన హాస్టళ్లను మంగళవారం తహసీల్దార్ సంజయ్ కుమార్, ఎంపీడీవో రామ్మోహన్, హీహెచ్‌సీ వైద్యాధికారి రజిత పలువురు అధికారులు సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని అధికారులు పరిశీలించారు